సాక్షి ఖమ్మం

మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



యాచకులు ఎందరు, ఎక్కడ?

జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో యాచకుల వివరాల నమోదుకు మెప్మా సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు.

10లో



ప్రేమజంట పెళ్లిపై ఘర్షణ

ప్రేమ పెళ్లి వ్యవహారంలో ఇరువర్గాలు పోలీసు స్టేషన్ వద్ద ఘర్షణ పడడంతో అడ్డుకోబోయిన హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి.

10లో

గరిష్టం / కనిష్టం
30° / 22°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఎండ ప్రభావం తక్కువగా ఉంటుంది. సాయంత్రం తర్వాత కొన్నిచోట్ల వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నూతన సబ్‌స్టేషన్లతో మెరుగైన విద్యుత్ సరఫరా



సబ్‌స్టేషన్ స్థల వివరాలు ఆరా తీస్తున్న ఎస్ఈ

తల్లాడ: అంతరాయాలు లేకుండా, మెరుగైన విద్యుత్ సరఫరా చేసేలా అవసరమైన చోట విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నట్లు ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. తల్లాడ మండలం అన్నారుగూడెంకు 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు కాగా, సోమవారం ఆయన స్థలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ స్థానిక రైతులు, నాయకులతో చర్చించి ప్రతిపాదించిన స్థలాల వివరాలు చర్చించారు. కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటుతో అన్నారుగూడెం, గోపాలపేట, నరసింహారావుపేట, బాలపేట, ఏన్కూరు మండలం గార్లొడ్డు గ్రామాలకు ఉపయోగం ఉంటుందని తెలిపారు. ట్రాన్స్‌కో ఎస్ఈ రాంబాబు, డీఈలు ఎల్.రాములు, భద్రుపవార్, కృష్ణారావు, దాసు, ఏడీఈలు సతీష్, ఖాదర్‌బాబా, ఏఈలు రాయల ప్రసాద్, కవిత, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ఆర్‌జేడీ, ఉద్యోగులు

వేంసూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తూ పోషణ లోపం నివారణకు కృషి చేస్తున్నామని ఐసీడీఎస్ వరంగల్ ఆర్‌జేడీ ఝాన్సీలక్ష్మీబాయి తెలిపారు. ఈమేరకు లబ్ధిదారులు అంగన్‌వాడీల్లో సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేంసూరు మండలం కొండెగట్ల కేంద్రంలో గురువారం పోషణ మాసోత్సవం సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాలతో కూడిన ఆహారం ఆవశ్యకతపై ఆర్‌జేడీ అవగాహన కల్పించారు. అలాగే, ప్రతిజ్ఞ చేయించారు. సీడీపీఓ మెహరున్నీసా బేగం, సూపర్‌వైజర్ భవాని, అంగన్‌వాడీ టీచర్లు కరుణ, నాగలక్ష్మి, పద్మ, చంద్రకళ, వాణి, జయ పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా పదోన్నతి



అదనపు డీసీపీ, పదోన్నతి పొందిన వారితో సీపీ

ఖమ్మంక్రైం: జోన్ పరిధి వివిధ పోలీస్ స్టేషన్లలో హెడ్ కానిస్టేబుళ్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పలువురికి ఏఎస్సైలుగా పదోన్నతి లభించింది. ఇందులో ఖమ్మం కమిషనరేట్‌కు కేటాయించిన ఉద్యోగులు సోమవారం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారిని అభినందించిన సీపీ పదోన్నతితో పాటు బాధ్యతలు పెరగనున్నందున చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని సూచించారు. అడిషనల్ డీసీపీ రామానుజం తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా.. శరవేగంగా



ఖమ్మం రూరల్ మండలం ఆరెంపులలో నిర్మాణం పూర్తయిన ఇల్లు

3లక్షలకు పైగా దరఖాస్తులు

ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలన, గ్రామ సభలతోపాటు మీ సేవ కేంద్రాల ద్వారా 3,48,740 దరఖాస్తులు వచ్చాయి. వీటిని ఎల్-1, ఎల్-2, ఎల్-3గా విభజించారు. సొంత జాగా ఉండి ఇళ్లు లేకుండా గుడిసె, రేకులషెడ్, టైల్స్ వేసిన, అద్దె ఇళ్లలో ఉండే వారిని ఎల్-1 జాబితాలో చేర్చారు. స్థలం కూడా లేని వారిని ఎల్-2 కేటగిరీ, ఇళ్లు ఉండి తల్లిదండ్రుల నుంచి విడిపోయి సొంతంగా ఇళ్లు కావాలని దరఖాస్తు చేసుకున్న వారిని ఎల్-3 కేటగిరీగా నిర్ణయించారు. దరఖాస్తుల ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం ఎల్-1లో 73,472, ఎల్-2లో 56,549, ఎల్-3లోకి 2,18,719 దరఖాస్తులను చేర్చిన అధికారులు మొదటి దశలో 16,678 ఇళ్లను మంజూరు చేశారు.

జిల్లాలో ఇళ్ల వివరాలు..

మంజూరైన ఇళ్లు	15,794
పైలట్ గ్రామాల్లో మంజూరైనవి	884
మొత్తం ఇళ్లు	16,678
ముగ్గు పోసినవి	13,976
బేస్‌మెంట్ స్థాయి	6,480
రూఫ్ లెవెల్	3,414
స్లాబ్ వేసినవి	2,438
నిర్మాణం పూర్తయిన ఇళ్లు	25

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై యంత్రాంగం దృష్టి

- జిల్లాకు 16,678 ఇళ్ల మంజూరు
- వివిధ దశల్లో నిర్మాణాలు నిరంతరం పరిశీలన
- త్వరగా పూర్తిచేసుకునేలా అవగాహన

జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా ప్రభుత్వ సూచనలతో అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోంది. అర్హులను గుర్తించి మంజూరు పత్రాలు ఇవ్వడమే కాక నిర్మాణం పూర్తిచేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. ఇంటి నిర్మాణంలో లబ్ధిదారులకు ఇబ్బందులు ఎదురైతే పరిష్కార మార్గాలను చూపిస్తున్నారు. అంతేకాక నిర్మాణ వివరాలను ఎప్పటికప్పుడు ఇందిరమ్మ యాప్‌లో అప్‌లోడ్ చేసి దశల వారీగా బిల్లులు మంజూరు చేయిస్తున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ప్రభుత్వం నిర్దేశించిన స్థలంలో..

పేదలకు అనువుగా, సౌకర్యవంతంగా ఇళ్లు ఉండేలా డిజైన్ రూపొందించిన ప్రభుత్వం మండల కేంద్రాల్లో నమూనా గృహాలను కూడా నిర్మించింది. ఇల్లు మంజూరైన అనంతరం లబ్ధిదారుడు ముగ్గు పోసుకుంటే పంచాయతీ కార్యదర్శి ఫొటో తీసి ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. బ్యాంకు అకౌంట్ నంబర్, స్థలం వారిదా, కాదా అని నిర్ధారించుకున్నాక ఇంటినిర్మాణం మొదలవుతుంది. ఒక్కసారి ఫొటో అప్‌లోడ్ చేశాక నిర్మాణ స్థలం మార్చడానికి వీల్లేకుండా నిబంధనలు పొందుపరిచారు. స్థలం 400 చదరపు అడుగుల(60 గజాలు)కు తగ్గకుండా ఉండాలి. ఇందులోని 45 గజాల్లో ఇంటి నిర్మాణం చేపట్టేలా పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పిస్తున్నారు.

అధికారుల పరిశీలన

ఇంటి నిర్మాణాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిబంధనలకు అనుగుణంగా పనులు జరిగేలా అవగాహన కల్పిస్తున్నారు. పునాది నిర్మాణం పూర్తయ్యాక మూడు చోట్ల నుంచి లబ్ధిదారుల ఫొటో తీసి కార్యదర్శి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే ఏఈ పరిశీలిస్తారు. నిర్దేశిత స్థలం, బ్యాంక్ అకౌంట్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ అన్నీ సక్రమంగా ఉంటే ఏఈ అప్రూవ్ చేయాలి. ఇదే సమయాన ఇల్లు ఎంత స్థలంలో నిర్మిస్తున్నారు, బెడ్‌రూం, వంట గది వేర్వేరుగా ఉన్నాయా, లేదా అని గుర్తించాక మేస్త్రీ ఫోన్ నంబర్, పేరు అప్‌లోడ్ చేస్తే డీఈ లాగిన్‌లోకి వెళ్తుంది. ఇక్కడ నుంచి బేస్‌మెంట్ లెవెల్, స్లాబ్, ఇల్లు పూర్తయ్యే వరకు పర్యవేక్షించి పీడీ లాగిన్‌కు చేరవేస్తారు. పీడీ సూపర్ చెకింగ్ తర్వాత కలెక్టర్‌కు, అక్కడ నుంచి గృహ నిర్మాణ శాఖ ఎండీ లాగిన్‌కు వెళ్తే అన్నీ పరిశీలించి దశల వారీగా నిధులు జమ చేస్తున్నారు.

నిర్మాణాల పూర్తిపై దృష్టి

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లుగానే, నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయించేలా ప్రభుత్వం సూచనలు చేస్తోంది. కొందరు నిరుపేద లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులతో నిర్మాణాలు ప్రారంభించడం లేదు. దీంతో అధికారులు సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నారు. ఇలా ప్రతీ అంశంలో ప్రత్యేక శ్రద్ధతో ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతం అయ్యేలా యంత్రాంగం ద్వారా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

రెండు రోడ్లకు రూ.40కోట్లు

సీఆర్ఎఫ్ నిధులతో విస్తరణ

ఖమ్మంఅర్బన్: జిల్లాలోని ఆర్‌అండ్‌బీ పరిధి రెండు ప్రధాన రహదారుల విస్తరణ కోసం కేంద్ర రోడ్డు నిధి (సీఆర్ఎఫ్) నుండి రూ.40 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో ఒక్కో రహదారికి రూ.20 కోట్ల చొప్పున కేటాయించారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ నిధులతో రెబ్బవరం – గన్నవరం రోడ్డు, లోకారం నుండి పెనుబల్లి వరకు రహదారులను విస్తరించనుండగా త్వరలోనే టెండర్లు పిలవనున్నట్టు తెలిసింది. ఇవికాక 'హైబ్రీడ్' విధానంలోనూ కొన్ని రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. మధిర నియోజకవర్గంలో ఆరు, ఖమ్మం, సత్తుపల్లి నియోజకవర్గాల్లో ఒక్కో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనట్టు సమాచారం. వీటి పనులకు కూడా త్వరలోనే టెండర్ ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఖమ్మం – ఇల్లెందు రోడ్డు విస్తరణ ప్రారంభం

నాలుగు నెలల విరామం తర్వాత ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారిపై రఘునాథపాలెం మండలంలో రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి. రూ.38 కోట్ల అంచనా వ్యయంతో ఏడాదిన్నర క్రితం రఘునాథపాలెం నుంచి మంచుకొండ వరకు రహదారి విస్తరణ పనులు మొదలుపెట్టారు. అయితే, రూ.6కోట్ల విలువైన పనులు చేసినా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ నిలిపివేశారు. అభివృద్ధి పనులు ఆగిపోవడం, అప్పటికే రోడ్డు దెబ్బతిని ఉండడంతో రాకపోకలకు ఇక్కట్లు ఎదురయ్యాయి. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకురాగా, బిల్లుల సమస్య పరిష్కరిస్తానని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇవ్వడంతో కాంట్రాక్టర్ సోమవారం నుంచి పనులు మొదలుపెట్టారు.



ఖమ్మం – ఇల్లెందు మార్గంలో నిర్మిస్తున్న రోడ్డు

పలు ప్రాంతాల్లో వర్షం

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆదివారం రాత్రి 11గంటల సమయాన భారీ శబ్దాలతో మెరుపులు, ఉరుములకు తోడు వర్షం మొదలైంది. కాగా, ఖమ్మంతో పాటు పలు గ్రామాల్లో పిడుగులు పడడంతో ని ఇళ్లలో విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. ఖమ్మం, పాలేరు డివిజన్లలో ఓ మోస్తరు వర్షపాతం నమోదు కాగా, సోమవారం ఉదయం కూడా కొన్నిచోట్ల వర్షం కురిసింది. రఘునాథపాలెంలో అత్యధికంగా 56 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, తిరుమలాయపాలెంలో 30.8, నేలకొండపల్లిలో 23.2, ముదిగొండలో 17.2, పెనుబల్లిలో 13.2, ఖమ్మం రూరల్‌లో 11.2 మి.మీ., సోమవారం సత్తుపల్లి మండలం సదాశివునిపాలెంలో 47 మి.మీ.లు, వేంసూరులో 35, సత్తుపల్లి మండలం గంగారంలో 22.3, సత్తుపల్లి ఓపెన్ కాస్ట్ వద్ద 19.8, సత్తుపల్లిలో 18 మి.మీల వర్షపాతం నమోదైంది. కాగా, భారీ వర్షంతో చేతికొచ్చే దశలో ఉన్న పత్తి పంటకు నష్టం ఎదురవుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అరకొరగా చెట్లపై ఉన్న పత్తి రంగు మారుతుండగా ధర పడిపోతుందని చెబుతున్నారు.

సాంకేతికను అందించేలా ఏటీసీ



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన కలెక్టర్ అనుదీప్, సీపీ సునీల్‌దత్ తదితరులు

- యువతకు ఉపాధి కల్పించేలా కోర్సులు
- ఏటీసీ ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్: అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా విద్యార్థులకు ఉపాధి కల్పించేలా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం టేకులపల్లిలోని ఐటీఐ ప్రాంగణంలో నిర్మించిన ఏటీసీని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్‌తో కలిసి మంత్రి సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఐటీఐల్లోని సంప్రదాయ కోర్సులతో ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నందున నైపుణ్య కోర్సులను రూపొందించి బోధనకు ఏటీసీలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. రానున్న 5 – 10 ఏళ్లలో జరిగే మార్పులు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఏటీసీలో కోర్సుల బోధన ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలోని ఏటీసీల్లో కోర్సులు పూర్తి చేసే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రముఖ సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెంల్లో నాలుగు ఏటీసీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు.

రోబోటిక్స్ బోధన కూడా..

ఖమ్మం ఏటీసీలో రోబోటిక్స్‌తో పాటు ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, మరమ్మతులపై శిక్షణ కోర్సులు ఉన్నాయని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. పరిశ్రమల డిమాండ్‌కు అనుగుణంగా కోర్సులను ప్రభుత్వం డిజైన్ చేయించిందని చెప్పారు. ఇక్కడ రోబోటిక్స్ కోర్సు పూర్తిచేసే విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పోలీసు కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ విద్యార్థులు చేసే కోర్సులు – పరిశ్రమల్లో అవసరాలకు తేడా ఉన్నందున ప్రభుత్వం ఏటీసీలను అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఏటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, విద్యుత్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈలు శ్రీనివాసాచారి, యాకోబు, ఆర్డీఓ నర్సింహారావు, కార్మిక శాఖ సహాయ కమిషనర్ కృష్ణవేణి, కార్పొరేటర్ సత్యనారాయణ, తహసీల్దార్ సైదులు పాల్గొన్నారు.

టీటీడీ ఆలయ నిర్మాణంపై సమీక్ష

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యాన నిర్మించే వేంకటేశ్వర స్వామి ఆలయానికి కావాల్సిన స్థలంపై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ అనుదీప్, ఆర్డీఓ జి.నరసింహారావు, తహసీల్దార్ డి.సైదులుతో సమావేశమైన ఆయన ఆలయ నిర్మాణానికి అనువుగా, ఎలాంటి వివాదాలు లేని స్థలాన్ని ఎంపిక చేసి టీటీడీ బృందానికి నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఈక్రమాన రవాణా సౌకర్యాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మేయర్ పి.నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, పీఏసీఎస్ అధ్యక్షుడు రావూరి సైదబాబు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

'ప్రజావాణి'లో కలెక్టర్ అనుదీప్

ఖమ్మం సహకారనగర్: ప్రజావాణిలో అందే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి అర్హతల మేర పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో ఆయన దరఖాస్తులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమైన కలెక్టర్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించడమే కాక ఏవైనా తిరస్కరిస్తే అందుకు కారణాలు తెలియచేయాలని చెప్పారు.

→ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా సమీకృత గురుకుల విద్యాలయాలకు భవన నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లతో కలిసి అధికారులతో సమీక్షించిన ఆయన మాట్లాడారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రూ.200 కోట్ల వ్యయంతో 20 – 25 ఎకరాల్లో పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కాగా, జూనియర్ కళాశాలల మరమ్మతులకు మంజూరైన రూ.2.90 కోట్ల నిధులతో అన్ని వసతులు కల్పించాలని చెప్పారు. ప్రతీ అధికారి వారానికి రెండేసి గురుకులాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని తెలిపారు.

→ జిల్లాలో ధాన్యం, పత్తి కొనుగోళ్లు సజావుగా సాగేలా ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. కొనుగోళ్లకు ఏర్పాట్లపై చర్చించిన ఆయన కేంద్రాల్లో వసతుల కల్పన, గన్నీ బ్యాగుల లభ్యతపై సూచనలు చేశారు. కాగా, కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ అనుదీప్ తనిఖీ చేసి భద్రతపై సమీక్షించారు.

→ కలెక్టరేట్‌లోని అన్ని శాఖల ఉద్యోగులు విధులు సమర్థవంతంగా నిర్వర్తిస్తూ రోజుకు రెండుసార్లు హాజరు వేయాలని కలెక్టర్ అనుదీప్ స్పష్టం చేశారు. ఇందిరా డెయిరీ పథకం, జాతీయ రహదారులకు భూసేకరణ, ఉద్యోగుల హాజరుపై సమీక్షించిన ఆయన ఎవరైనా రెండు సార్లు హాజరు నమోదు చేయపోతే చర్యలు తప్పవని తెలిపారు.



గ్రీవెన్స్ డేలో వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్

→ **ఖమ్మంవైద్యవిభాగం:** అత్యవసర సమయాల్లో ఉపయోగపడే సీపీఆర్‌పై ప్రతిఒక్కరు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ ఉద్యోగులకు వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆకస్మికంగా వచ్చే గుండెపోటు నుంచి బాధితులను రక్షించేందుకు సీపీఆర్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సమావేశాల్లో డీఆర్ఓ ఏ.పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, డీఐఈఓ రవిబాబు, పౌరసరఫరాల సంస్థ డీఎం శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ.అలీం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ కళావతిబాయి, డీసీహెచ్ఎస్ రాజశేఖర్, విద్యాశాఖ ఈఈ బుగ్గయ్య, ఉద్యోగులు చందూనాయక్, శ్రీనివాసరావు, ఎం.ఏ.రాజు, అన్సారీ పాల్గొన్నారు.

కలప విలువ రూ.3కోట్లకు పైగానే..

- సంద్ర కలప రవాణాపై కొనసాగుతున్న విచారణ
- పాత్రధారులు, వారి వాటాలపై అధికారుల ఆరా

ఖమ్మంవ్యవసాయం: ఉత్తరాది రాష్ట్రాలకు విలువైన కలపను అక్రమంగా తరలించిన వ్యవహారంపై విచారణ కొనసాగుతోంది. నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్ సిస్టం(ఎన్‌టీపీఎస్) ద్వారా తప్పుడు వివరాలతో పర్మిట్లు తీసుకుని సాధారణ కలప స్థానంలో రూ.కోట్ల విలువైన సంద్ర కలపను మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హరియాణా, అరుణాచల్‌ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లోని పాన్ మసాలా తయారీ ఫ్యాక్టరీలకు తరలించారు. అయితే, మహబూబాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ కలపను సేకరించినా చింతకాని మండలం నుంచి తుమ్మ కలప తరలిస్తున్నట్లు పర్మిట్లు తీసుకున్నారు. ఈ అక్రమాలను మధ్యప్రదేశ్ రాష్ట్రంలో అక్కడి అటవీ అధికారులు గుర్తించడంతో కొద్ది రోజులుగా విచారణ జరుగుతోంది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ రేంజ్ పరిధిలోని మన్నెగూడెం, తోడేళ్లగూడెం, సీరోలు, కురవి ప్రాంతాల అసైన్డ్ భూముల నుంచి సంద్ర కలపను నరికి, చింతకాని సెక్షన్ నుంచి 24 లారీల కలపకు పర్మిట్లు తీసుకోవడం విశేషం. ఒక్కో లారీ సంద్ర కలప విలువ రూ. 15 లక్షల వరకు ఉండగా, మొత్తం రూ.3.60 కోట్ల విలువైన కలప అక్రమంగా తరలించినట్లు తేల్చారు. దీంతో పాటు తరలింపునకు సిద్ధం చేసిన మరో మూడు లారీల సంద్ర కలపను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.



ఎవరి వాటా ఎంత?

విలువైన సంద్ర కలప రవాణాలో పాలుపంచుకున్న వారిని ఫోన్‌కాల్ డేటా ఆధారంగా అధికారులు ఇప్పటికే గుర్తించారు. ప్రధాని సూత్రధారితో పాటు ఆయనకు సహకరించిన అటవీ శాఖ ఉద్యోగులు, మధ్యవర్తులను ఇప్పటికే విచారించి వారి ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సూత్రధారి, మధ్యవర్తులు ఎవరిరెవరితో మాట్లాడారో నిగ్గు తేల్చే క్రమాన అటవీ ఉద్యోగుల పాత్ర బయటపడింది. ఈక్రమంలోనే ప్రధాన సూత్రధారితో అధికారులకు ఒప్పందాలు, మధ్యవర్తి అకౌంట్ ద్వారా నగదు లావాదేవీలు వెలుగు చూసినట్లు సమాచారం. అక్రమాల వెనుక ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని కొందరు అటవీ ఉద్యోగులు ఉండగా, ఇప్పటికే ముగ్గురిని సస్పెండ్ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో మహబూబాబాద్ అటవీ శాఖలో ఇంకొందరు ఉద్యోగులపై వేటు పడే అవకాశముందని సమాచారం.

పలు రైళ్ల రద్దు

- పది రైళ్లకు 18వ తేదీ వరకు బ్రేక్
- మూడో లైన్ పనులతో నిర్ణయం


ఖమ్మంరాపర్తినగర్: జిల్లా మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను అధికారులు రద్దు చేశారు. పాపటపల్లి – డోర్నకల్ మార్గంలో మూడో రైల్వే లైన్ నిర్మాణ పనుల నేపథ్యాన ఈ నిర్ణయం తీసుకున్నారు. పలు రైళ్లను మంగళవారం నుంచి ఈనెల 18 వరకు రద్దు చేయగా, ఇంకొన్నింటిని మాత్రం నిర్ణీత తేదీల్లోనే నడిపిస్తారు. అలాగే, ఆదిలాబాద్ – తిరుపతి(17406) కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఈనెల 16, 17 తేదీల్లో రీ షెడ్యూల్ చేశారు. తద్వారా రైలు గంటన్నర ఆలస్యంగా నడుస్తుంది.

రద్దయిన రైళ్ల వివరాలు

కాజీపేట – డోర్నకల్ మార్గంలో ఇరువైపులా రాకపోకలు సాగించే(67765, 67766) ప్యాసింజర్‌ను ఈనెల 18వ తేదీ వరకు రద్దు చేశారు. అలాగే, డోర్నకల్ – విజయవాడ(67767, 67768), విజయవాడ – కొత్తగూడెం (67215, 67216) ప్యాసింజర్లతో పాటు గుంటూరు – సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ (12705, 12706), విజయవాడ – సికింద్రాబాద్ (12713, 12714) శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 18వ తేదీ వరకు ఇరువైపులా రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. అంతేకాక కోర్బా–కూచ్‌వెలి (22647) ఎక్స్‌ప్రెస్‌ను 15, 18వ తేదీల్లో, కూచ్‌వెలి – కోర్బా ఎక్స్‌ప్రెస్ (22648)ను ఈనెల 13, 16వ తేదీల్లో, గోరఖ్‌పూర్–కూచ్‌వెలి (12511) ఎక్స్‌ప్రెస్‌ను 10, 12వ తేదీల్లో, కూచ్‌వెలి – గోరఖ్‌పూర్ (12512) ఎక్స్‌ప్రెస్‌ను 17వ తేదీన, బరౌని – ఎర్నాకులం (12521) ఎక్స్‌ప్రెస్‌ను 13న, ఎర్నాకులం – బరౌని ఎక్స్‌ప్రెస్ (12522)ను 17వ తేదీన రద్దు చేశారు. అంతేకాక విశాఖపట్నం – న్యూఢిల్లీ (20805) ఎక్స్‌ప్రెస్‌ను 16, 17న, తిరుగు ప్రయాణం(20806)లో 16న, విశాఖపట్నం – గాంధీగమ్ (20803) ఎక్స్‌ప్రెస్‌ను 16న, తిరుగు ప్రయాణం(20804)లో 19వ తేదీన, గుంటూరు – సికింద్రాబాద్ (17201) గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 18వరకు, తిరుగు ప్రయాణం (17202)లో ఈనెల 17వ తేదీ వరకు, షాలిమర్ – చర్లపల్లి రైలును రెండు మార్గాల్లో (18045, 18046) వెళ్లేటప్పుడు 16, 17వ తేదీల్లో, తిరుగు ప్రయాణంలో 17, 18వ తేదీల్లో రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇక సీఎస్‌టీ ముంబై– భువనేశ్వర్ (11019) రైలును 16, 17వ తేదీల్లో, భువనేశ్వర్ – సీఎస్‌టీ ముంబై (11020) రైలును 17, 18వ తేదీల్లో, సాయినగర్ షిర్డీ – కాకినాడ ఎక్స్‌ప్రెస్(17205)ను 16న, కాకినాడ – సాయినగర్ షిర్డీ (17206) ఎక్స్‌ప్రెస్‌ను 18వ తేదీన దారి మళ్లించి నడిపించనున్నారు.

బదిలీల్లో రాజకీయ ఒత్తిళ్లు?

- వైరాలో మొన్న కమిషనర్, నేడు సీఐ
- నిలిచిపోయిన సీఐ బదిలీ



వైరా: వైరా నియోజకవర్గంలో పలువురు అధికారుల బదిలీలు అర్ధంతరంగా ఆగిపోతున్నాయి. తొలుత ఉత్తర్వులు వెలువడడం, కొత్త అధికారి బాధ్యతల స్వీకరణకు వచ్చేలోగా ఆ ఉత్తర్వులు ఆగిపోయాయని చెప్పడం సర్వసాధారణంగా మారింది. ఇందుకు రాజకీయ పార్టీల నేతల నుంచి ఉన్నతాధికారులపై వస్తున్న ఒత్తిడే కారణమని తెలుస్తోంది.

ఆగస్టులో కమిషనర్

గత ఆగస్టులో వైరా మున్సిపల్ కమిషనర్ చింతా వేణును బదిలీ చేయడమే కాక ఆయన స్థానంలో నల్లగొండ జిల్లా నుంచి యు.గురులింగంను కేటాయించారు. దీంతో గురులింగం బాధ్యతలు స్వీకరించడానికి కార్యాలయానికి రాగా, ఆయన బదిలీ నిలిపేశారని తెలియడంతో వెనక్కి వెళ్లారు. ఆతర్వాత ఏం జరిగిందో ఏమో కానీ మళ్లీ గురులింగంనే కేటాయించగా ఆయన విధుల్లో చేరారు. ఇక తాజాగా శనివారం వైరా సీఐ నూనావత్ సాగర్ బదిలీ అయినట్లు ఉత్తర్వులు అందాయి. ఆయనను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేయడమే కాక ఐజీ కార్యాలయంలో ఉన్న వినయ్‌కుమార్ వైరాకు కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం వినయ్‌కుమార్ వైరా చేరుకోవడంతో సాగర్ బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధమయ్యారు. ఇంతలోనే వినయ్‌కుమార్‌ను వెనక్కి వచ్చేయాలని సూచించడంతో పాటు వైరా సీఐగా సాగరే కొనసాగుతారని మౌఖిక ఆదేశాలు రావడం గమనార్హం. రాజకీయ నాయకుల నుంచి ఒత్తిడి పెరగడం, పలానా అధికారే కావాలని నేతలు పట్టుబడుతుండడంతోనే బదిలీల్లో మార్పులు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఇదిలా ఉండగా వైరా ఏసీపీగా తమకు అనుకూలమైన అధికారికి పోస్టింగ్ ఇప్పించుకోవాలని కొందరు నేతలు ప్రయత్నిస్తుండడంతోనే ఇంకా ఎవరినీ నియమించడం లేదని సమాచారం.

క్లుప్తంగా

జాతీయ స్థాయి టోర్నీలో వైశాలికి రజతం


వైశాలితో కోచ్ గౌస్

ఖమ్మం స్పోర్ట్స్: ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఖమ్మంకు చెందిన బి.వైశాలి హెప్టాథిలిన్ ఈవెంట్‌లో రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. అండర్–18 బాలికల విభాగంలో పోటీకి దిగిన ఆమె ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా వైశాలిని డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ అభినందించారు.

అండర్-17 ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: అండర్–17 విభాగంలో ఉమ్మడి జిల్లా బాలబాలికల వాలీబాల్ జట్లను సోమవారం ఎంపిక చేశారు. జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు పెద్దసంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో బాలురు అత్యధికంగా రావడంతో తొలుత 100మందిని గుర్తించి, స్క్రీనింగ్ అనంతరం వారిలో నుంచి జట్టును ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా బాలుర జట్టుకు యు.ఉదయ్ ముఖేష్, బి.నందకిషోర్, బి.చరణ్, ఎం.సాయిక్షయ్‌కుమార్, ఎస్.కే.షరీఫ్, ఎం.ధనుంజయ్, కె.నవీన్, బి.చేతన్, డి.రోహన్, పి.సాయిరాంతో పాటు స్టాండ్ బైగా బి.గణేష్, ఎస్.కే.ముద్దషీర్ ఎంపికయ్యారు. అలాగే, బాలికల జట్టుకు జి.హాసిని, కె.అమృత, బి.నాగేశ్వరి, పి.అనూష, బి.శ్వేత, బి.గౌతమి, వి.లావణ్య, టి.ఉమారాణి, హెచ్.భార్గవి, స్టాండ్ బైగా పి.కరుణ్య, కె.చరితరెడ్డి ఎంపిక చేశారు. ఎంపిక పోటీలను జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి వై.రామారావుతో పాటు పీఈటీలు చిన్ని, పవన్‌కుమార్, రామారావు తదితరులు పర్యవేక్షించారు.

ప్లేట్‌లెట్లు పడిపోయిన వ్యక్తికి వైద్యుడి రక్తదానం


రక్తదానం చేస్తున్న డాక్టర్ అవినాష్

సత్తుపల్లిరూరల్: చికిత్స చేయడమే కాదు అవసరమైతే చేయూతనివ్వాలనే భావనతో రక్తదానం చేసిన ప్రభుత్వ వైద్యుడు మానవత్వాన్ని చాటాడు. సత్తుపల్లి మండలం తుంబూరుకు చెందిన రాంబాబు ఇటీవల గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాగా పరీక్షించిన డాక్టర్ అవినాష్ ఆయనకు ప్లేట్ లైట్స్ తక్కువగా ఉన్నందున ఖమ్మం ప్రధాన ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆతర్వాత రాంబాబు ఖమ్మంలో చికిత్స చేయించుకుంటుండగా వివరాలు ఆరా తీసేందుకు సోమవారం అవినాష్ అక్కడకు వెళ్లారు. అయితే, ఆయనకు రక్తం ఇచ్చేందుకు సత్తుపల్లి నుండి ఇద్దరు వెళ్లినా గ్రూప్ సరిపోకపోవడం, పరిస్థితి విషమిస్తుండడంతో అవినాష్ స్వయంగా రక్తదానం చేయడంపై పలువురు అభినందించారు.

ఆపరేటర్ నియామకాలకు రేపు రాత పరీక్ష, ఇంటర్వ్యూ

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిర్వహించే సదరం శిబిరాల్లో రెండు డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కంప్యూటర్ పరిజ్ఞానం, ఇంటర్నెట్ వాడకంపై ప్రావీణ్యత, డేటా ఎంట్రీ పనిలో అనుభవం కలిగిన అభ్యర్థులు మంగళవారం సాయంత్రం 5గంటల్లోగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. వీరికి బుధవారం 60 మార్కులతో రాత పరీక్ష నిర్వహించడమే కాక ఇంటర్వ్యూ అనంతరం ఎంపిక చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటిండెంట్ కార్యాలయంలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి పూజలు చేశాక నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, నిత్యకల్యాణంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
ఏసీ మిర్చి	15,225	8,000
మిర్చి	8,100	6,000
కొత్త పత్తి	7,100	4,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,400

యాచకులు ఎందరు, ఎక్కడ?

- కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో వివరాలు సేకరణ
- బిక్షాటనకు కారణాలు, వారి జీవనశైలిపై ఆరా
- కేంద్ర ప్రభుత్వ ఆదేశంతో సర్వే చేస్తున్న మెప్మా అధికారులు
- ఈనెల 16వ తేదీ నాటికి నివేదికలు సిద్ధం


వైరా బస్టాండ్‌లో వివరాల సేకరణను పరిశీలిస్తున్న డీఎంసీ సుజాత

ఖమ్మంమయూరిసెంటర్: రద్దీ ప్రాంతాల్లో, ప్రార్థనా మందిరాలు, బస్టాండ్లు, వీధుల వెంట బిక్షాటన చేస్తున్న వారి వివరాలు, వారి జీవన స్థితిగతులను తెలుసుకునేందుకు కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పట్టణాలు, నగరాల్లో యాచకుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. యాచకుల జీవన శైలి, తీసుకుంటున్న ఆహారం, ఆరోగ్యం, యాచనకు కారణాలు తెలుసుకునేందుకు కేంద్రప్రభుత్వం ప్రత్యేక నమూనా రూపొందించింది. ఈ నమూనా ఆధారంగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మధిర, సత్తుపల్లి, కల్లూరు, వైరా, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో మెప్మా అధికారులు, సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

మున్సిపాలిటీల పరిధిలో పేదరిక నిర్మూలన ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మున్సిపాలిటీల పరిధిలో బిక్షాటనే జీవనాధారంగా గడిపే వారి సంఖ్య ఏటేటా గణనీయంగా పెరుగుతోంది. పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెడుతున్నా యాచకుల దరికి చేరడం లేదు. సరైన చిరునామాతో పాటు ఆధార్ కార్డు తదితర గుర్తింపు లేకపోవడం.. ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితుల్లో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. దీంతో వీరి వివరాలు గుర్తించాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

పక్కాగా వివరాల నమోదు

కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో బిక్షాటనే జీవనంగా బతుకుతున్న వారి వివరాల సేకరణకు కేంద్రప్రభుత్వం 'మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్' పేరుతో సర్వే చేయిస్తోంది. ఆదివారం ప్రారంభమైన సర్వే ఈనెల 16వరకు మెప్మా సీఓలు, ఆర్‌పీల ఆధ్వర్యాన కొనసాగుతుంది. కేఎంసీలో సోమవారం సర్వే తీరుతెన్నులపై దిశానిర్దేశం చేశారు. టీఎంసీ జి.సుజాత, సీఓలు రోజా, సల్మా, ఉపేంద్ర ఆర్పీలకు శిక్షణ ఇచ్చి, గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు.

బిక్షాటన ఎందుకు?

మెప్మా ఉద్యోగులు సర్వేలో భాగంగా యాచకుల పూర్తి వివరాలను సేకరించనున్నారు. పురుషులు / స్త్రీలు, వయసు, కుటుంబ స్థితిగతులు, పెళ్లయిందా, విడాకులు తీసుకున్నారా.. పెళ్లయితే పిల్లలు ఎందరు, వారి వయస్సు, మతం, కులం తదితర వివరాలు ఆరా తీస్తున్నారు. అంతేకాక బిక్షాటనకు కారణాలు కూడా తెలుసుకుంటున్నారు. దివ్యాంగులా, వృద్ధాప్యమే కారణమా, మాదకద్రవ్యాలను వాడుతున్నారా, చేతిలో పిల్లలతో చేస్తున్నారా.. మాతృభాష, రాత్రి ఎక్కడ నివాసముంటున్నారనే తదితర వివరాలను నమోదు చేసుకుంటారు.

ఆరు ప్రధాన ప్రశ్నలు

యాచకుల వివరాలను సేకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నమూనా విడుదల చేసింది. మొదటి, రెండో కేటగిరీల్లో యాచకుల వ్యక్తిగత వివరాలు, కుటుంబ వివరాలపై ప్రశ్నలు ఉన్నాయి. ఎవరైనా బలవంతం చేస్తున్నారా, లేక జీవనం కోసమే బిక్షాటన చేస్తున్నారా.. వచ్చే డబ్బులు ఎంత, ఆ డబ్బు ఎలా ఖర్చు పెడుతున్నారనే అంశాలను మూడో కేటగిరీలో పొందుపరిచారు. నాలుగో కేటగిరీ కింద చేయూతనిస్తే బిక్షాటన నిలిపేస్తారా, చదువు, నైపుణ్య శిక్షణపై ఆసక్తి ఉందా, బిక్షాటన నిలిపిస్తే పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు ఉన్నాయి. ఐదో కేటగిరిలో యాచకుల ఆహారం, ఆరోగ్య పరిస్థితులు, ఆరో కేటగిరి ద్వారా జీవితంలో ఏం కావాలి, ప్రభుత్వం నుంచి సాయం ఆశిస్తున్నారా, ఎవరైనా దుర్భాషలాడారా అనే వివరాలు సేకరిస్తున్నారు.

టీచర్ల సర్దుబాటుపై సమీక్ష ?!

ఇకపై నిరంతరం నిర్వహించాలని నిర్ణయం

సత్తుపల్లి: ఉపాధ్యాయుల సర్దుబాటుపై అందుతున్న అభ్యంతరాలు, వినతులపై జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సమీక్షించే అవకాశముందని తెలుస్తోంది. 'పైరవీలకే పెద్దపీట' శీర్షికన 'సాక్షి'లో సోమవారం టీచర్ల సర్దుబాటు అంశంలో లోపాలపై కథనం ప్రచురితమైంది. ఉపాధ్యాయులను మండల పరిధి పాఠశాలల్లో సర్దుబాటు చేయాల్సి ఉన్నా, సత్తుపల్లి మండలం మినహా పెనుబల్లి, వేంసూరు, కల్లూరు మండలాల్లో జిల్లా కేంద్రం సమీప పాఠశాలలను కొందరిని పంపించారు. 317 జీఓ ద్వారా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు పలువురు కూడా సర్దుబాటును ఆసరా తీసుకొని సమీప మండలాలకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. అయితే, ఇందులో చాలా మంది రాజకీయ పలుకుబడి ఉపయోగించుకున్నారని, అధికంగా ఉపాధ్యాయుల ఉన్న చోట నుంచి ఇతర ప్రాంతాలకు సర్దుబాటు చేస్తూ ఉన్నతాధికారుల నుంచే ఉత్తర్వులు వచ్చాయని చెబుతున్నారు. ప్రక్రియ మొత్తం ఉపాధ్యాయ సంఘాల నాయకుల సమక్షాన పారదర్శకంగా చేశామని కొందరు ఎంఈఓలు పేర్కొంటున్నా... పలువురు ఉపాధ్యాయులు సర్దుబాటు ద్వారా జిల్లా కేంద్రంలోని పాఠశాలలకు వెళ్లడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

ఖాళీ పోస్టులపై నేడు సమావేశం

సత్తుపల్లి, వైరా, ఖమ్మం నియోజకవర్గాల్లో ఈనెలతో పాటు నవంబర్‌లో ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయుల వివరాలు, తద్వారా ఖాళీ కానున్న పోస్టులపై మండలాల వారీగా ఎంఈఓలు, హెచ్‌ఎంలతో అదనపు కలెక్టర్ సమావేశం కానున్నారు. ఈ సమావేశంలోనే సర్దుబాటులో వచ్చిన అభ్యంతరాలను చర్చించే అవకాశముందని తెలిసింది. ఇదిలా ఉండగా రిటైర్డ్ అయ్యే ఉపాధ్యాయ స్థానాల్లో అధికంగా ఉన్న పాఠశాలల టీచర్లను సర్దుబాటు చేస్తారని, ఇక నుంచి ఈ ప్రక్రియ నిరంతరంగా సాగుతుందని సమాచారం.

ప్రేమజంట పెళ్లిపై పీఎస్‌లో ఘర్షణ

అదుపు చేసేందుకు యత్నించిన హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు


ఘర్షణను అదుపు చేస్తున్న ఎస్సై జగదీశ్, వెనుక గాయపడిన హెడ్ కానిస్టేబుల్ బాలు

తిరుమలాయపాలెం: ఓ ప్రేమజంట వివాహం చేసుకోగా, పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడగా అదుపు చేసేందుకు యత్నించిన ఓ హెడ్‌కానిస్టేబుల్ తలకు తీవ్ర గాయమైంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గోల్‌తండా వాసి బోడ కృష్ణ కుమార్తె బోడ కీర్తనకు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం అందనాలపాడు కొత్తతండాకు చెందిన అంగోత్ నవీన్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఈనెల 12న బయటకు వెళ్లిన కీర్తన నవీన్‌ను పెళ్లి చేసుకుంది. ఈ ఘటనపై కృష్ణ ఫిర్యాదు చేయగా పోలీసులు ప్రేమజంటను సోమవారం స్టేషన్‌కు పిలిపించారు. అక్కడకు ఇరు కుటుంబాల వారు రావడంతో కీర్తన బంధువులు నవీన్‌పై దాడికి పాల్పడ్డారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణకు దిగగా అదుపు చేసేందుకు యత్నించిన హెడ్‌కానిస్టేబుల్ బాలును నెట్టేయడంతో తల గోడకు తాకి తీవ్ర గాయమైంది. ఈమేరకు ఎస్‌ఐ కూచిపూడి జగదీష్ ఇరువర్గాలను అదుపు చేసి బాలుకు స్థానికంగా చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించడమే కాక కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంకి చెందిన అంగోత్ వివేక్, గుగులోత్ నవీన్, గుగులోత్ మాజీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తక్షణమే సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య


మార్కెట్‌లో పత్తిని పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పత్తి చేతికొస్తున్న నేపథ్యాన ప్రభుత్వం సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించి రైతులను ఆదుకోవాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య డిమాండ్ చేశారు. సంఘం నాయకులు సోమవారం ఖమ్మం మార్కెట్‌లో పత్తి రైతుల సమస్యలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ అనుదీప్, మార్కెట్ కార్యదర్శికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయకుండా పత్తి రైతులను ఆదుకునేలా వెంటనే కొనుగోళ్లు మొదలుపెట్టాలని కోరారు. జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు ముందుకురాగానే ప్రభుత్వమే మార్కెట్ యార్డుల్లో కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, కోలేటి నాగేశ్వరరావు, నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, కమ్మకోమటి నాగేశ్వరరావు, కేలోతు లక్ష్మణ్, పాశం అప్పారావు, గుగులోత్ తేజనాయక్, కుర్ర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో మళ్లీ అంతర్గత బదిలీలు

భద్రాచలం: శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో సోమవారం పలువురు సిబ్బందిని అంతర్గత బదిలీ చేశారు. ఈఓగా కొల్లు దామోదర్‌రావు బాధ్యతలు స్వీకరించాక సిబ్బందిని బదిలీ చేయడం ఇది రెండోసారి. ఈమేరకు ఈఓ సీసీ, గోశాల ఫైల్ కరస్పాండెన్స్ ఎ.శ్రీనివాసరెడ్డిని సెంట్రల్ స్టోర్స్ ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించడంతో పాటు సీనియర్ అసిస్టెంట్ ఆర్.బాలాజీని అన్నదాన సత్రం ఇన్‌చార్జ్ నుంచి ప్రసాదాల తయారీ విభాగానికి, ప్రసాదాల విభాగం నుంచి శ్రీనివాసరావును పర్ణశాల గుమస్తాగా, ఆ పోస్టులో ఉన్న కన్సాలిడేటెడ్ ఎం.అనిల్‌కుమార్‌ను దేవస్థానంలో కీలక విభాగమైన ఎస్టాబ్లిష్‌మెంట్, పే బిల్స్‌కు బదిలీ చేశారు. ఎస్టాబ్లిష్‌మెంట్ క్యాషియర్ టి.రాజేష్‌ను డిపాజిట్, డీడీ, ఇతర రిజిస్టర్ల విభాగానికి, ప్రసాదాల విభాగం నుంచి ఉన్న సతీష్‌ను ఈఓ అటెండర్‌గా, ఈఓ అటెండర్ నందసాయిని ప్రసాదాల ఇన్‌చార్జ్‌గా, కంప్యూటర్ ఆపరేటర్ ఎం.మృణాళినిని ఇంజనీరింగ్ సెక్షన్ ఓఎస్‌గా, ఫైల్ కరస్పాండెన్స్‌గా, సునీతకు ప్రొటోకాల్ ఆఫీస్ ఇన్‌చార్జ్‌గా, వస్త్రాల స్టోర్స్ తదితర బాధ్యతలు అప్పగిస్తూ ఈఓ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు కీలక బాధ్యతలు?

ఈఓ బాధ్యతలు స్వీకరించిన అనతికాలంలోనే రెండుసార్లు అంతర్గత బదిలీలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. ఇవి సాధారణ బదిలీలే అయినా అన్ని విభాగాల్లో ఒకేసారి మార్పులు చోటుచేసుకోవడం గమనార్హం. ఇదే సమయాన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న కొందరికి కీలక విభాగాలు అప్పగించడంపై పలువురు అభ్యంతరం తెలుపుతున్నారు.

● మా పరిస్థితి ఏమిటి సార్?


నిరుపేదలు, తల్లిదండ్రులు లేని పిల్లల కోసం ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీం(బీఏఎస్)ను ప్రవేశపెట్టి ప్రైవేట్ స్కూళ్లలో ప్రవేశాలు కల్పిస్తోంది. అయితే, గత రెండున్నరేళ్ల నుంచి ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో నిర్వహణ భారంగా మారిందంటూ పాఠశాలల యాజమాన్యాలు ఫీజు చెల్లించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. దసరా సెలవుల అనంతరం కొన్నిచోట్ల విద్యార్థులను అనుమతించకపోవడంతో తల్లిదండ్రులు నచ్చచెప్పి చేర్పించారు. ఈనేపథ్యాన బీఏఎస్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులతో తల్లిదండ్రులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి తమ గోడు వివరించారు. బకాయిలు విడుదల చేసి పిల్లల చదువుకు ఆటంకం రాకుండా చూడాలని కోరారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్


చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన చెల్లని చెక్కు జారీ చేసిన వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం ఒకటో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి బెక్కమ్ రజని సోమవారం తీర్పుచెప్పారు. ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన కోటకొమ్ముల నాగరాజు వద్ద భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ వాసి బొందిలి రామారావు 2019 నంబర్‌లో రూ.8 లక్షల అప్పు తీసుకున్నారు. తిరిగి 2021 అక్టోబర్‌లో రూ.8లక్షలకు చెక్కు జారీ చేసినా ఆయన ఖాతాలో సరిపడా నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో నాగరాజు తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. ఈమేరకు కేసు విచారణ అనంతరం రామారావుకు జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.8లక్షలు చెల్లించాలని న్యాయాధికారి తీర్పు చెప్పారు.

లాభాల పేరిట రూ.30లక్షలు కాజేసిన వ్యక్తి అరెస్ట్

ఖమ్మంక్రైం: ఆన్‌లైన్‌లో పార్ట్ టైమ్ ఉద్యోగం చేయిచ్చని, వివిధ రంగాల్లో పెట్టుబడి ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి సుమారు రూ.30లక్షలు కాజేసిన కేసులో మహారాష్ట్రకు చెందిన వ్యక్తిని ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. ఔరంగబాద్ జిల్లా ఛత్రపతి శంబాజీనగర్ వాసి రవీంద్ర లక్ష్మణ్‌రావు జారస్‌కు వేంసూరు మండలానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగితో టెలిగ్రామ్ యాప్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో నమ్మించి ఆయన వివిధ రూపాల్లో రూ.30లక్షలు జమ చేయించుకున్నాడు. ఆపై మోసపోయినట్లు గుర్తించిన వేంసూరు వాసి సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా రూ.5లక్షలను నిందితుడు డ్రా చేయకుండా ఆపారు. ఆపై స్వస్థలంలో జారస్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు సోమవారం ఖమ్మం తీసుకొచ్చారు. కేసులో కీలకంగా వ్యవహరించిన సైబర్ క్రైం డీఎస్పీ ఫణీందర్, సీఐలు యాసిన్, నరేష్, ఎస్‌ఐలు కృష్ణ, విజయ్‌కుమార్, కానిస్టేబుళ్లు రాజేందర్, సంతోష్ సిబ్బందిని సీపీ సునీల్‌దత్ అభినందించారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య?


మణికంఠ (ఫైల్)

తల్లాడ: మండలంలోని మల్సూర్‌తండాకు చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన మాలోతు మణికంఠ(19) ఇంటి వద్ద నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. దీంతో ఆయనను ఖమ్మంలోని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కాగా, ప్రేమ విఫలం కావడంతోనే మణికంఠ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు తల్లాడ ఎస్‌ఐ వెంకటకృష్ణ ఆధ్వర్యాన విచారణ చేస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు

ఖమ్మంక్రైం: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై ఖమ్మం త్రీటౌన్ పోలీసులు సోమవారం పోక్సో కేసు నమోదు చేశారు. ఖమ్మం జహీర్‌పుర ప్రాంతానికి చెందిన గోపి సుక్కు అదే ప్రాంతానికి బాలికపై అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ మోహన్‌బాబు తెలిపారు.

గంజాయి రవాణాదారులపై పీడీ యాక్ట్

ఖమ్మంరూరల్: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన సిద్దిపేట జిల్లా మందపల్లికి చెందిన పల్లపు రఘు, నల్లగొండ జిల్లా మిర్యాలగూడెం మండలం వెంకటాద్రికి చెందిన మహ్మద్ ఖాజా పాషాపై పీడీ యాక్టు కొనసాగిస్తున్నట్లు ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి తెలిపారు. వీరిద్దరు ఈ ఏడాది ఫిబ్రవరి 24న రూ.89లక్షల విలువైన 179 కేజీల గంజాయిని కారులో తరలించే క్రమాన కూసుమంచి మండలం చేగొమ్మ క్రాస్ వద్ద పట్టుబడ్డారు. దీంతో వీరిని రిమాండ్ నిమిత్తం హైదరాబాద్‌లోని చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. అలాగే, ఆగస్టు 26న రఘు, పాషాపై కూసమంచి సీఐ సంజీవ్ పీడీ యాక్ట్ నమోదు చేశారు. వీరిపై పీడీ యాక్టు నమోదును తెలంగాణ అడ్వైజరీ కమిటీ బోర్డు ఆమోదించడంతో కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని ఏసీపీ తెలిపారు.

చిరుతపులి గోర్ల తస్కరణ..

ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): చనిపోయిన చిరుతపులి గోర్లను తస్కరించిన వ్యక్తికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కే.సాయిశ్రీ సోమవారం తీర్పు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అబ్బుగూడెం బీట్ పరిధిలో కంపార్ట్‌మెంట్–35 అటవీ ప్రాంతాన 2016 సంవత్సరంలో రెండు చిరుతపులులు రెండు మేకలపై దాడి చేసి హతమార్చాయి. దీంతో బాధిత రైతు మేకల కళేబరాలపై పురుగుల మందు చల్లాడు. వాటిని తిన్న రెండు చిరుతలు మృత్యువాత పడ్డాయి. ఈమేరకు అటవీశాఖ బీట్ ఆఫీసర్ రమేష్ బాబు సంఘటనా స్థలాన్ని సందర్శించి, చిరుతపులి గోర్లను తస్కరించినట్లు గుర్తించారు. దీంతో అటవీశాఖ అధికారులు అబ్బుగూడెం గ్రామానికి చెందిన బూస సత్యం, పోతిని మంగయ్య, బూస హనుమంతరావు, కర్రి ఆశయ్య, ఎం.లక్ష్మారెడ్డి, ఎం.లక్ష్మయ్యపై అప్పట్లో కేసు నమోదు చేశారు. ఈ ఆరుగురిలో లక్ష్మయ్య కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. మిగిలిన వారిలో ఎం.లక్ష్మారెడ్డి నిందితుడిగా తేల్చిన కోర్టు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పగా, మిగిలిన వారిపై నేరం రుజువు కాలేదని కేసు కొట్టేసింది.

ఇంటిపై పిడుగుపాటు

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం పరిధి శ్రీరాంనగర్‌కు చెందిన యాకయ్య ఇంటిపై ఆదివారం అర్ధరాత్రి పిడుగు పడింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండగానే భారీ శబ్దంతో పిడుగు పడగా ఆయన కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఇంటిపైన పిల్లర్‌పై పిడుగు పడడంతో పాక్షికంగా ధ్వంసం కాగా, ఇతర నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

రెండు పాడిగేదెల చోరీ

బోనకల్: మండలంలోని కలకోటలో గుర్తుతెలియని వ్యక్తులు రెండు పాడి గేదెలను చోరీ చేశారు. గ్రామానికి చెందిన తోటపల్లి గురవయ్య ఆదివారం రాత్రి తన గేదెలను ఇంటి ముందు కట్టేశాడు. సోమవారం ఉదయంకల్లా రూ.1.50లక్షల విలువైన గేదెలు లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మున్నేటి వరదలో చిక్కుకున్న ట్రాక్టర్లు


వరద నుంచి బయటకు వస్తున్న డ్రైవర్

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ మున్నేటిలో సోమవారం ఒక్కసారిగా వరద పోటెత్తింది. దీంతో తీసుకొచ్చేందుకు వెళ్లిన మూడు ట్రాక్టర్లు సహా డ్రైవర్లు చిక్కుకున్నారు. నీటి ప్రవాహం పెరుగుతుండగానే కూలీలు అప్రమత్తమై పరుగుపరుగున ఒడ్డుకు చేరారు. అప్పటికే ట్రాక్టర్ల ఇసుక లోడు చేసి ఉన్నా బయటకు తీసుకురాలేక డ్రైవర్లు సైతం బయటకు వచ్చారు. దీంతో వరద ప్రవాహంలోనే మూడు ట్రాక్టర్లు నిలిచిపోయాయి. కాగా, మున్నేటి ఉధృతితో ముదిగొండ మండలం పండ్రేగుపల్లి – చింతకాని మండలం రామకృష్ణాపురం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

విద్యుదాఘాతంతో దుక్కిటెడ్లు మృతి


మృతి చెందిన దుక్కిటెడ్ల వద్ద రైతు

కారేపల్లి: స్తంభానికి విద్యుత్ సరఫరా కావడంతో దాన్ని తాకిన రెండు దుక్కిటెడ్లు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. కారేపల్లి మండలం తొడితలగూడెంకు చెందిన రైతు శ్యాంలాల్ సాహు తన చేనులో ఉన్న విద్యుత్ స్తంభానికి రెండు ఎద్దులను కట్టివేశాడు. ఈక్రమాన వర్షం రావడంతో స్తంభానికి విద్యుత్ సరఫరా కాగా ఎద్లు షాక్‌కు గురైన అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.2లక్షల విలువైన దుక్కిటెడ్ల మృతితో జీవనాధానం కోల్పోయినందున తమ కుటుంబాన్ని ఆదుకోవాలని శ్యాంలాల్ కోరాడు. ఈవిషయమై విద్యుత్ సిబ్బంది స్పందించాలని స్థానికులు విన్నవించారు. అలాగే, ఇలాంటి ఘటనలు జరగకుండా పర్యవేక్షించాలని కోరారు.